క్లుప్తంగా

దివ్య కల్యాణ మహోత్సవాల కరపత్రాల ఆవిష్కరణ

పిఠాపురం: పంచమాధవ స్వయంభూ దివ్యక్షేత్రమైన కుంతీ మాధవ స్వామి దివ్య కల్యాణ మహోత్సవాల కరపత్రాన్ని శనివారం ఎమ్మెల్యే పెండెం దొరబాబు ఆవిష్కరించారు. ఈ మహోత్సవాలు 30న ప్రారంభమవుతాయన్నారు. పలువురు వైఎస్సార్ సీపీ నేతలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణానికి మోక్షం



సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన చైర్‌పర్సన్, కో ఆప్షన్ సభ్యుడు, కౌన్సిలర్లు

సామర్లకోట: స్థానిక జగ్గమ్మగారిపేట అమాణమ్మ అపార్టుమెంట్ నుంచి అయోధ్యరామపురం వరకు రూ.కోటితో నిర్మించే సీసీ రోడ్డు పనులకు చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు దవులూరి సుబ్బారావు ప్రారంభించారు. మున్సిపాలిటీ నిధులతో ఈ రోడ్డు నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ రహదారితో అమాణమ్మ అపార్టుమెంటతో పాటు సమీపంలో ఉన్న టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు మార్గం ఏర్పడుతుందన్నారు. రహదారి పనులు వేగంగా చేయాలని కాంట్రాక్టర్ రెడ్నం దొరబాబుకు సూచించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఉబా జాన్‌మోజెస్, కౌన్సిలర్లు, పిట్టా సత్యనారాయణ, జట్ల మోహన్, గుబ్బల సత్యనారాయణ, పాగా సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఎడారి ఓడ హల్‌చల్



సామర్లకోటలో అలరించిన ఒంటెలు

సామర్లకోట: ఎడారి ఓడలైన ఒంటెలు స్థానిక రహదారిపైకి వచ్చి స్థానికులకు సంభ్రమాశ్చర్యాలకు గురిచేశాయి. చిన్నారులు వీటిని ఆసక్తిగా తిలకించారు. స్థానిక స్టేషన్ సెంటర్ నుంచి బ్రౌన్‌పేట మీదుగా తుని వెళుతున్న ఒంటెలను కొద్ది సమయంలో నిర్వాహకులు పట్టణంలో తిప్పారు. గ్రామ గ్రామంలో ఒంటెలను తిలకించడం ద్వారా ప్రజలు ఇచ్చిన సొమ్ముతో జీవిస్తుంటామని నిర్వాహకులు అంజమ్మ, రాముడు తెలిపారు. దారి పొడవునా పిల్లలు, పెద్దలు ఒంటెలను తమ తమ సెల్ ఫోన్లలో బంధించారు.

గొల్ల మారమ్మతల్లి ఆలయానికి విరాళం

కొత్తపల్లి: మండలంలోని రమణక్కపేటలో నూతనంగా నిర్మించిన గొల్లమారమ్మ అమ్మవారి ఆలయ అభివృద్ధికి శనివారం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ రూ.25వేలను అందజేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు అనిశెట్టి సత్యానందరెడ్డి, పెనుమల్లు కృష్ణారెడ్డి, అబ్బిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఏనుగుపల్లి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సారా అరికట్టండి

సామర్లకోట: మండల పరిధిలో జి.మేడపాడులో సారా అరికట్టాలని మహిళలు ఆందోళన చేశారు. గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మోరంపూడి శ్రీరంగనాయకులుకు వారు సమస్య వివరించగా, ఈ సమస్యపై అనేక పర్యాయాలు ఎక్సైజ్ అధికారులకు వివరించామని, అయినా స్పందించలేదని ఆయన పేర్కొన్నారు. సోమవారం నాటి స్పందనలో కలెక్టరుకు ఫిర్యాదు చేస్తామని ఆయన చెప్పారు.

ప్రత్యేక హోదా హామీలు సాధించాలి

పిఠాపురం: స్థానిక ప్రభుత్వ కళాశాలలో ప్రత్యేక హోదా విభజన హామీల సాధన కోరుతూ శనివారం విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు సిద్ధు కార్యదర్శి శ్రీకాంత్, లోవరాజు, సూర్య తదితరులు పాల్గొన్నారు

కేన్సర్ రోగికి ఆర్థిక సాయం



మణికంఠ కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందిస్తున్న నాయకులు

కొత్తపల్లి: మండలంలోని కొండెవరం గ్రామానికి చెందిన కేదంశెట్టి మణికంఠ గొంతు కేన్సర్‌తో బాధపడుతున్నాడు. నియోజవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి మాకినీడి శేషుకుమారి మణికంఠను పరామర్శించి జనసైనికులు సేకరించిన రూ.21,600 అందజేశారు. మండల జనసేన అధ్యక్షుడు పట్టా శివ, మేడిశెట్టి కామేష్ తదితరులు పాల్గొన్నారు.



సామర్లకోట పంచారామ క్షేత్రంలో స్వామివారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు



పాండవుల మెట్టపై సూర్యభగవానుడి దర్శనానికి బారులు తీరిన భక్తులు



పాండవుల మెట్టపై పాలు పొంగిస్తున్న మహిళలు

ప్రత్యక్ష నారాయణా నమోస్తుతే..

- నేత్ర పర్వంగా సూర్యనారాయణమూర్తి కల్యాణాలు
- క్లస్టర్ పరిధిలో భక్తిశ్రద్ధలతో ఆలయాల్లో పూజలు



పాండవుల మెట్ట ఆలయ ప్రాంగణంలో పొంగలి చేస్తున్న భక్తులు



సామర్లకోట రామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం కుమారారామభీమేశ్వరస్వామి ఆలయంలో సూర్యనారాయణమూర్తి ఆలయంలో శనివారం స్వామి వారి కల్యాణం నేత్ర పర్వంగా జరిగింది. రథసప్తమిని పురస్కరించుకుని స్వామికి పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు, పట్టు వస్త్రాలు, పూలతో అలంకరణ చేశారు. ఈఓ డి.నాగమల్లేశ్వరరావు, దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు, ఆలయ ట్రస్టు బోర్డు సభ్యుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ట్రస్టుబోర్డు సభ్యులు నేతల వెంకటలక్ష్మి, చల్లా కుమారి, యండమూరి వెంకటసుబ్బారావు, కర్రి వెంకటలక్ష్మి, కౌన్సిలర్ నేతల హరిబాబు భక్తులకు సేవలందించారు. భక్త సంఘం నాయకుడు బిక్కిన సత్యసాయి పరమేశ్వరరావు కుటుంబ సభ్యులు స్వామివారి కల్యాణం నిర్వహించారు. సూర్యనారాయణమూర్తి విశిష్టత, సూర్య నమస్కారాల ప్రాధాన్యత, స్వామి కల్యాణ విశేషాలను అన్నవరం దేవస్థాన ఘనాపాటి శ్రీపాద రాజశేఖరశర్మ వివరించారు. ఆలయ పండితులు సన్నిధిరాజు వెంకన్న, చెరుకూరి రాంబాబు, కొంతేటి జోగారావు, వినయ్ పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం జరిగింది.

రామలింగేశ్వరస్వామి ఆలయంలో....

స్థానిక ఐదు తూముల వద్ద ఉన్న అన్నపూర్ణ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆలయ వ్యవస్థాపకుడు పరమానందగిరి స్వామి ఆధ్వర్యంలో సూర్యనారాయణ మూర్తి కల్యాణం జరిగింది. అలాగే స్థానిక మాండవ్యనారాయణస్వామి ఆలయంలోను, జగదీశ్వర స్వామి ఆలయంలోను, మండల పరిధిలో వేట్లపాలెం వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి పూజలు నిర్వహించారు.

భక్తులతో పోటెత్తిన పాండవుల మెట్ట

పెద్దాపురం: అమరగిరి మెట్ట(పాండవుల మెట్ట) పై శనివారం రథసప్తమి వేడుకలకు భక్తులు పోటెత్తారు. ఆలయ కమిటీ నిర్వాహకులు వై.అనంతలక్ష్మి, గీతావాణి, వై.కిషోర్ భక్తులకు ఏర్పాట్లు చేశారు. మహిళలు ఆవు పిడకలపై పాలు పొంగించి పరవాన్నం చేసి నైవేద్యం పెట్టారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, కౌన్సిలర్ విడదాసరి రాజా, కో-ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, ప్రముఖులు స్వామివారిని దర్శించుకుని పొంగలి సమర్పించి స్వామి వారి కళ్యాణాన్ని తిలకించారు. డీఎస్పీ మొగిలి వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు సీఐ అబ్దుల్ నబీ పర్యవేక్షణలో ఎస్ఐ వెలుగుల సురేష్ భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.

మెట్టపై వైభవంగా కల్యాణం

పెద్దాపురం: స్థానిక అమరగిరి మెట్టకు భక్తులు పోటెత్తారు. మహిళలు మెట్టపై పాలు పొంగించి స్వామి కల్యాణాన్ని తిలకించారు. అలాగే స్థానిక వర్జులవారి వీధిలోని భువనేశ్వరి పీఠంలో తృచ సౌర అరుణ సహిత సూర్య నమస్కారాలను లలితా వాస్తు జ్యోతిష్యాలయ నిర్వాహకులు చింతా గోపిశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో నిర్వహించారు. మండలంలోని గుడివాడ శ్రీకృష్ణాశ్రమంలో గురువు గవరసాని గోపాలకృష్ణ ఆధ్వర్యంలో చవ్వాకుల అప్పారావు, లక్ష్మి, ఈశ్వరరావు, సంతోషి దంపతులు హోమం, సూర్య భగవానుడు యజ్ఞం నిర్వహించారు. మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించి సూర్య నమస్కారాలు చేశారు. అనంతరం భారీ అన్నదానం చేశారు. గుండాబత్తుల సుబ్బరాజు, ఉప్పులూరి గంగాధరం, చవ్వాకుల వీరభద్రరావు, కనపర్తి బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

సూర్య భగవానుడికి ప్రత్యేక పూజలు

కొత్తపల్లి: స్థానిక రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి, ఉప్పాడ, కొండెవరంలో వెంకటేశ్వర స్వామి, రమణక్కపేట విజయ జనార్దన స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చిరుధాన్యాలపై పరిశోధనలు ముమ్మరం చేయాలి

- వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త మునిరత్నం



వ్యవసాయ పరిశోధనా క్షేత్రాన్ని పరిశీలిస్తున్న మునిరత్నం తదితరులు

పెద్దాపురం: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో చిరుధాన్యాల సాగుపై శాస్త్రవేత్తలు పరిశోధనలను మరింత ముమ్మరం చేయాలని వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పి.మునిరత్నం అన్నారు. స్థానిక వ్యవసాయ పరిశోధనా క్షేత్రంలో శనివారం ఆయన శాస్త్రవేత్తలతో శిక్షణ-సందర్శన నిర్వహించారు. ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ సీహెచ్‌వీ నరసింహారావు అధ్యక్షతన జరిగిన శిక్షణలో మునిరత్నం మాట్లాడుతూ అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం-2023ను ప్రకటించిన నేపథ్యంలో శాస్త్రవేత్తలు ఆ దిశగా పరిశోధనలు ముమ్మరం చేసి పోషక విలువలున్న చిరుధాన్యాల ఉత్పత్తిని పెంచాలన్నారు. రైతులకు వాటిపై శిక్షణ ఇచ్చి వారి ఆదాయ వనరులను పెంచడంతో పాటు పోషక విలువలున్న చిరు ధాన్యాల పంటలపై దృష్టి సారింపజేయాలని అన్నారు. అనంతరం ఆయన శాస్త్రవేత్తలతో కలిసి వ్యవసాయ పరిశోధనా క్షేత్రాన్ని సందర్శించారు. జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు, శాస్త్రవేత్తలు శర్మ, బాలాజీనాయక్, సుధీర్ కుమార్, సుజాతతో పాటు జిల్లాలోని ఏడీఏలు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కమిటీ సమావేశం వాయిదా

సామర్లకోట: మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన శనివారం జరగాల్సిన సమావేశం వాయిదా పడింది. ఈ సమావేశానికి కాంట్రాక్టర్లు హాజరు కాక పోవడంతో సోమవారానికి వాయిదా వేస్తున్నట్లు చైర్‌పర్సన్ తెలిపారు. వైస్ చైర్మన్ మోజెస్, కాంట్రాక్టు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఆదాయంపై దృష్టి పెట్టండి

- అధికారులపై కౌన్సిల్ ఆగ్రహం
- రూ.3.87 కోట్ల మిగులు బడ్జెట్ ఆమోదం



సమావేశంలో సభ్యులకు వివరణ ఇస్తున్న కమిషనర్ సురేంద్ర

పెద్దాపురం: కమ్యూనిటీ భవనాలపై ఆదాయం రాబట్టలేకపోవడంపై మున్సిపల్ కౌన్సిల్ సమావేశం మండిపడింది. పురపాలక సంఘం వార్షిక బడ్జెట్, సర్వసాధారణ సమావేశం శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన జరిగింది. కౌన్సిలర్లు విజ్జపు రాజశేఖర్ మాట్లాడుతూ పట్టణంలో మున్సిపల్ స్థలాలిచ్చి, భవనాలు నిర్మించేందుకు నిధులిచ్చినప్పుడు దానిపై వచ్చే ఆదాయం మున్సిపాల్టీకి చెందాలని, ఆ ఆదాయంపై దృష్టి సారించాలని సూచించారు. కౌన్సిలర్లు ఆరెళ్ళి వీర్రాఘవులు, పప్పల దుర్గారావులు శతాబ్ది పార్కు అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. కౌన్సిలర్ విజ్జపు రాజశేఖర్ స్థానిక మెయిన్‌రోడ్డులోని షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, కుక్కలకు వ్యాక్సినేషన్ చేయించాలని సూచించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్లు నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి పట్టణాభివృద్ధికి చర్యలు రూ.కోట్లతో చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. అనంతరం రూ.3.87 కోట్ల వార్షిక మిగులు బడ్జెట్‌ను చైర్‌పర్సన్ తులసీ మంగ తాయారు ప్రవేశపెట్టారు. మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు తలారి శ్యామలత, షేక్ రఫీ, వాసంశెట్టి గంగ, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముప్పన శ్యామలాంబ, కౌన్సిలర్లు సయ్యద్ ఆమీనా బీబీ, పేరింశెట్టి అంబిక, ఆకుల కృష్ణ బాపూజీ, విడదాసరి రాజా, కొట్టి పవన్ కిశోర్, అధికారులు పాల్గొన్నారు.

ఫ్లైఓవర్‌పై స్తంభించిన ట్రాఫిక్



సామర్లకోట ఫ్లైఓవర్‌పై బారులు తీరిన వాహనాలు

సామర్లకోట: స్థానిక ఫ్లై ఓవర్‌పై శనివారం సాయంత్రం ట్రాఫిక్ స్తంభించింది. వారం చివరి రోజు కావడంతో ఉద్యోగులు, విద్యార్థులు త్వరగా గమ్యస్థానాలకు చేరుకోవాలనే ఆతృతతో వాహనాలను ముందుకు ఉరికించడంతో పరిస్థితి నెలకొంది. కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరడంతో వాహన చోదకులు అసౌకర్యానికి గురయ్యారు. బ్రిడ్జి కూడలి కాకినాడ- ద్వారపూడి వెళ్లే మార్గంలో కాంక్రీట్ మిక్సర్ సాంకేతిక లోపంతో నిలిచిపోయింది. దాంతో వాహనాలు బారులు తీరాయి. ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు, ఎస్సై టి.సునీత, ఏఎస్సై రత్నం, ట్రాఫిక్ సిబ్బంది సత్వర చర్యలు తీసుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

- ఎమ్మెల్యే దవులూరి దొరబాబు
- గొల్లప్రోలులో గడప గడపకూ



గొల్లప్రోలులో లబ్ధిదారుకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

కొత్తపల్లి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల అమలుపై ప్రజల్లో వంద శాతం సంతృప్తి కనిపిస్తోందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. గొల్లప్రోలు నగర పంచాయతీ 4వ సచివాలయంలో 10వ వార్డులో శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి ఇంటికీ వెళ్లి వారికి అందిన పథకాలను వివరించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తాను, సీఎం చిత్తశుద్ధితో వ్యవహరిస్తుంటే ప్రతిపక్ష పార్టీలు, కొన్ని పత్రికలు అసత్యాలు చెబుతున్నాయని మండిపడ్డారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాలలో 95 శాతానికి పైగా పూర్తి చేసిన ఘనత తమ ప్రభుత్వానిదని ధైర్యంగా చెప్పే దమ్ము తమకు ఉందన్నారు. పార్టీలు, కుల, మత భేదాలు లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదేన్నారు. ఇది మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వమన్నారు. వైఎస్సార్ సీపీ నేతలు, అధికారులు పాల్గొన్నారు.

మూగ జీవాలకు కొండంత భరోసా



వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవా వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

పిఠాపురం: నాణ్యమైన, మెరుగైన పశు వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. గొల్లప్రోలు నగర పంచాయతీలో ఉన్న పశు వైద్యశాల వద్ద శనివారం ఎమ్మెల్యే వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవా వాహనాన్ని ప్రారంభించారు. గ్రామ స్థాయిలో పని చేసేలా హేతుబద్ధమైన వ్యవస్థ ఉండాలని ఉద్దేశంతో సీఎం కృషి చేస్తున్నారు. మూగ జీవాలకు అందిస్తోన్న సేవల్లో దేశానికి మన రాష్ట్రం మార్గనిర్దేశంగా నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నేతలు, అధికారులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు గుర్తింపు



తహసీల్దార్, ఈఓ పీఆర్డీలను సత్కరించిన ఎంపీపీ, ఎంపీడీఓ తదితరులు

సామర్లకోట: ఉత్తమ సేవలు అందించే వారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు పేర్కొన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా కాకినాడ సామర్లకోట తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారి, మండల పరిషత్తు ఈఓపీఆర్డీ హిమమహేశ్వరి ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్న విషయం విదితమే. ఈ మేరకు శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన వారిని సత్కరించారు. ఎంపీడీఓ డి.శ్రీలలిత, పరిపాలనాధికారి వీవీ సాయిబాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలి

- జెడ్పీటీసీ సూరిబాబు
- పెద్దాపురం మండల బడ్జెట్ సమావేశం



ఎంపీడీఓను ప్రశ్నిస్తున్న ఎంపీటీసీ వీరభద్రరావు

పెద్దాపురం: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పని చేయాలని జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు అన్నారు. మండల పరిషత్ బడ్జెట్ సమావేశం శనివారం ఎంపీపీ పెంకే సత్యవతి అధ్యక్షతన జరిగింది. అనంతరం జీరో అవర్‌లో తిరుపతి ఎంపీటీసీ కుంచే బుచ్చిరాజు మాట్లాడుతూ గ్రామంలోని శృంగార వల్లభ స్వామి ఆలయం కమ్యూనిటీ హాల్ లెవలింగ్ పనులు చేపట్టాలని, ఎంపీటీసీ మొయిళ్ల కృష్ణ పార్కింగ్ వేలం పెట్టనీయకుండా ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. కాండ్రకోట ఎంపీటీసీ జాగు భద్రరావు, సర్పంచ్ శ్రీనివాసులు మాట్లాడుతూ కాండ్రకోట రహదారిలో మలుపుల వద్ద స్పీడు బ్రేకర్లు వేయించాలన్నారు. ఇదే అంశంపై ఎంపీడీఓ హిమమహేశ్వరి స్పందిస్తూ పిచ్చి తుప్పల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని ఏపీఓ స్వామిని ఆదేశించారు. మండలం 2022-23 అంచనా బడ్జెట్ రూ. 40,41,01,000, వ్యయ బడ్జెట్ రూ.40,41,81,000 మిగులు బడ్జెట్ 80,000 ఎంపీపీ సత్యవతి ప్రకటించగా సభ్యులు ఆమోదించారు. తహసీల్దార్ వజ్రపు జితేంద్ర, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వల్లూరి జ్యోతి, మండల కో-ఆప్షన్ సభ్యులు బిక్కిన శేష వీరకుమారి, హౌసింగ్ చైర్మన్ పీఎస్ రాజశేఖర్, మండల విస్తరణాధికారి మూర్తి, మండల విద్యాశాఖాధికారి సత్యనారాయణ, వ్యవసాయ శాఖ ఏఓ సంజయ్ కుమార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులు పరిష్కరించాలి



మాట్లాడుతున్న మూడో అదనపు జిల్లా జడ్జి కమలాదేవి. చిత్రంలో న్యాయమూర్తులు

కాకినాడ లీగల్: వచ్చేనెల 11న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో పెండింగ్ కేసుల పరిష్కారానికి సమన్వయంతో కృషి చేయాలని కాకినాడ మూడో అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్ పి.కమలాదేవి అన్నారు. స్థానిక కోర్టులో శనివారం బీమా కంపెనీ అధికారులు, న్యాయవాదులతో సమావేశం నిర్వహించి కేసుల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎల్.వెంకటేశ్వరరావు, నాలుగో అదనపు జిల్లా జడ్జి ఎం.హరినారాయణ, ఆరో అదనపు జిల్లా జడ్జి ఆర్‌వీ నిఖిత పాల్గొన్నారు.

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు వీవీఎస్ విద్యార్థి



వంశీని అభినందిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: విజయనగరంలో జరిగిన స్టేట్‌మీట్ అండర్-17 కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరిచిన జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థి నక్కా వంశీ జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు వీవీఎస్ విద్యాసంస్థల కరస్పాండెంట్ అనిశెట్టి కృష్ణారెడ్డి తెలిపారు. శనివారం వంశీని అభినందించి గ్రామానికి, పాఠశాలకు పేరు తేవాలన్నారు.

శృంగారవల్లభుని దర్శనానికి భక్తుల బారులు



అన్నదానం వద్ద భక్తుల రద్దీ



పూజలందుకున్న తిరుపతి శంగార వల్లభ స్వామి

- విరాళాలు, టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.2. లక్షల ఆదాయం

పెద్దాపురం: తొలి తిరుపతి శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం భక్తులు బారులు తీరారు. జిల్లా దేవదాయ శాఖ కమిషనర్, ఇన్‌చార్జి ఆలయ ఈఓ పులి నారాయణమూర్తి, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు దాతలు, భక్తులకు ఆశీర్వచనం అందించారు. భక్తుల నుంచి అన్నదానం, విరాళాలు, టిక్కెట్ల ద్వారా శనివారం ఒక్కరోజు 2,00,210 రూపాయలు సమకూరినట్లు ఈఓ తెలిపారు. పులిహోర ప్రసాదంతో పాటు అన్నదానానికి భక్తులు క్యూ కట్టారు. ఎంపీటీసీ కుంచే బుచ్చిరాజు, కర్రి జగదీష్ హాజరు కాగా సుమారు నాలుగు వేల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

స్టాటస్టిక్స్ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు విస్తృతం

బాలాజీచెరువు: స్టాటస్టిక్స్ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు విస్తృతంగా ఉంటాయని సిటీ ప్లానింగ్ ఆఫీసర్ పి.త్రినాథ్ పేర్కొన్నారు. ఆదిత్య డిగ్రీ కళాశాలలో శనివారం స్టాటస్టిక్స్ విభాగం ఆధ్వర్యంలో సినర్జియా-2022 సదస్సు నిర్వహించారు. త్రినాథ్ మాట్లాడుతూ స్టాటస్టిక్స్ విద్యార్థులకు కేంద్ర, రాష్ట్రాల్లో పలు ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. పలు పోటీల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్ బీఈవీఎల్ నాయుడు, ఏఎస్ఓ సుదర్శన్, వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ పాల్గొన్నారు.

గూడ్స్ షెడ్ తనిఖీ

కాకినాడ సిటీ: దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ పీసీసీఎం జి.జాన్ ప్రసాద్ శనివారం కాకినాడ గూడ్స్ షెడ్‌ను తనిఖీ చేశారు. సిబ్బంది, కార్మికులతో కొద్దిసేపు ముచ్చటించారు. సీపోర్టు, కోరమాండల్ ఫెర్టిలైజర్స్, నాగార్జున ఫెర్టిలైజర్స్‌లో గూడ్స్ రైల్‌లో ఎగుమతులపై వారు తీసుకుంటున్న భద్రతా ఏర్పాట్లును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గూడ్స్ షెడ్‌లో పని చేస్తున్న సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డీసీఎం జి.సోమశేఖర్‌నాయుడు, ఏఓ వినాయకంత్, సంతోష్‌కుమార్, సిహెచ్ స్వామిరాజశేఖర్ తదితరులు ఈ తనిఖీల్లో పాల్గొన్నారు.